

ఫారెస్టు కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోడు భూముల సమస్యను పరిష్కరించాలని సోమవారం చేపట్టే కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దిందా గ్రామస్థులు కాలినడక హైదరాబాద్‌కు ముఖ్యమంత్రిని కలిసేందుకు వెళ్లితే మార్గ మధ్యంలోనే అరెస్టు చేసి తిరిగి బస్సులో దిందాకు పంపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోడు రైతులపై అటవీ శాఖ అధికారులు వేధింపులు అధికమవుతున్నాయని చెప్పారు. ప్రజా క్షేత్రంలో పోరాడి పోడు రైతులకు అండగా ఉంటామని తెలిపారు. బీసీలకు పోడు భూములపై హక్కు లేదని ఎమ్మెల్సీ దండే విఠల్ పేర్కొనడం అన్యాయమని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీల పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని ఎలా హామీ ఇచ్చారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలనే కాంగ్రెస్ సైతం చేస్తోందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, ఈర్ల విశ్వేశ్వర్ రావు, గోలేం వెంకటేష్, రాజేందర్ గౌడ్, విజయ్, రాపర్తి ధనుంజయ్, సుధాకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాలా నిర్మించాలని వినతి

కాగజ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో పద్మశాలి కమ్యూనిటీ హాలు ఎదుట నాలా నిర్మించాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబుకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు ముందు నాలా లేక రోడ్డుపై నీరు నిలుస్తోందన్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలా నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాపెల్లి సదానందం, నల్ల కనకయ్య, గుళ్లపల్లి నాగేశ్వర్‌రావు, గడాదాసు మల్లయ్య, అల్లి గురవయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

ప్రసవ వేదన



దహెగాం మండలంలో ఎడ్లబండిలో ఇంటికి వెళ్తున్న బాలింత పుష్పలత(ఫైల్)



కెరమెరి మండలం అనార్‌పల్లి వాగులో తల్లీబిడ్డలను దాటిస్తున్న కుటుంబ సభ్యులు(ఫైల్)

- ఆసిఫాబాద్ ఏజెన్సీలో రోడ్లు, బ్రిడ్జిలు లేక గర్భిణుల అవస్థలు
- అంబులెన్స్‌లు సైతం గ్రామాలకు వెళ్లలేని దుస్థితి
- ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఓ వైపు పురిటి నొప్పులు, మరో వైపు ఆసుపత్రికి చేరేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక గిరిజన గ్రామాల్లో దశాబ్దాలుగా వినిపిస్తున్న ప్రసవ వేదనలు జిల్లాలోని పలు చోట్ల చోటు చేసుకుంటూనే ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే పొంగిపొర్లుతున్న వాగులు, బురదరోడ్లపై కనీసం అంబులెన్స్‌లు కూడా గ్రామాలకు చేరుకోలేక పోవడంతో గర్భిణులను ఆసుపత్రులకు తరలించేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఆసిఫాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీ పరిధిలోని గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయాలు లేక పోవడం, అంబులెన్స్‌లు సైతం వెళ్లలేక పోవడం వల్లే గర్భిణులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం వచ్చిందటే చాలు పొంగిపొర్లుతున్న వాగులు అడుగు తీసి అడుగు వేయలేని దైన్యం.. అంబులెన్స్‌లు రాని రహదారులు.. అక్కడి తల్లులకు ప్రసవ వేదనకు గురిచేస్తున్నాయి. రహదారి మార్గాలు లేక ఎడ్లబండ్లే దిక్కవుతున్నాయి. పురిటి నొప్పులతో అవస్థలు పడుతున్న గర్భిణులను సమయానికి ఆసుపత్రులకు చేర్చే దారి లేక కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎడ్లబండిపై వాగులు దాటి సమయానికి ఆస్పత్రికి చేరితే సరి. లేదంటే తల్లి బిడ్డ ప్రాణాలకు సంకటంగా మారుతోంది.

15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తం ఐదు సామాజిక ఆసుపత్రులు, రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 118 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 44 మంది వైద్యుల పోస్టులకు గాను కేవలం 27 మంది విధులు నిర్వహిస్తున్నారు. మరో 17 వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఏఎన్ఎం ఇతర సిబ్బంది మొత్తం 481పోస్టులకుగాను 336 మంది పని చేస్తున్నారు. 145 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేక సేవలు అందించలేక పోతున్నారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 2,930 మంది గర్భిణులున్నారు. వీరిలో తొమ్మిది నెలలు నిండిన వారు 610 మంది ఉన్నారు. గతేడాది నుంచి ఇప్పటివరకు 1,699 ప్రసవాలు జరిగాయి.

జిల్లాలో 101కి పైగా గిరిజన గూడాలు అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా ఉన్నాయి. ఆయా గ్రామాలకు కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఏటా వర్షాకాలంలో వాగులు, ఒర్రెలు దాటుకుంటూ అక్కడికి చేరుకోవడం వైద్య సిబ్బందికి సవాలుగా మారుతోంది. ఇప్పటికైనా అధికా రులు, ప్రజాప్రతినిధులు స్పందించి మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యంతో పాటు అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నడకకు సైతం..

జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల పరిధిలోని రోడ్లపై వర్షాకాలంలో నడిచేందుకు సైతం తీవ్ర అవస్థలు తప్పడం లేదు. భారీ వర్షాలు కురిస్తే వాగులు, కల్వర్టుల పైనుంచి వరదనీరు ఉప్పొంగితే రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇలాంటి సమయంలో ఆయా గ్రామాల పరిధిలో ఎవరైన గర్భిణి పురిటి నొప్పులతో బాధ పడితే ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు.

ఇటీవల జిల్లాలోని కెరమెరి మండలంలోని బోర్లగూడకు చెందిన అశ్విని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను 102లో స్వగ్రామానికి తీసుకు వస్తున్న క్రమంలో అనార్‌పల్లి గ్రామశివారులో ఉన్న వాగు ప్రమాదకరంగా ప్రవహించింది. దీంతో బిక్కుబిక్కు మంటూ కుటుంబీకులు తల్లీబిడ్డలను ఎత్తుకొని వాగు దాటించారు. దహెగాం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన లోహకు చెందిన చెందిన పుష్పలత అనే గర్భిణికి పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. లోహకు వెళ్లేదారి బురదమయంగా ఉండ డంతో గ్రామం వరకు అంబులెన్స్ రాలేకపోయింది. కుటుంబ సభ్యులు నెలలు నిండిన పుష్పలతను ఆరు కిలోమీటర్ల దూరం వరకు ఎడ్ల బండిలో ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. ప్రసవం తర్వాత కూడా మళ్లీ ఎడ్లబండిలోనే కుటుంబ సభ్యులు ఇంటికి చేర్చారు. జిల్లాలో ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని మారుమూల గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని తుంపల్లి వాగును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపనదులు ఉప్పొంగే ప్రమాదం ఉన్నందున ప్రజలెవరు అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దన్నారు. భారీ వర్షాల వల్ల పంట నష్టం జరిగిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం తరపున అందాల్సిన నష్ట పరిహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులు సంతోష్, సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్య పరిష్కరిస్తాం

కాగజ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోడు భూముల సమస్య పరిష్క రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీజేపీ నాయకులు చేస్తున్న రాద్ధాంతాన్ని ప్రజలు, పోడు రైతులు, అఖిల పక్షం నాయకులు నమ్మవద్దని ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల పోడు రైతుల సమస్య పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. అపోహాలు పెట్టుకోకూడదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మకూడదని కోరారు.

ఆలయంలో హోమం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రకుంట గ్రామంలో సోమవారం చేపట్టే అభయాంజనేయ స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం హోమం నిర్వహించారు. వేదపండితులు దుధిల మనోహర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి రోజు గణపతి పూజ, పుణ్యవచనం, అఖండ దీపా రాధన, నవగ్రహ పూజ, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఉమేష్ యాదవ్ దంపతులు తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఆంజనేయ స్వామి, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, అనంతరం అన్నప్రసాదన కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, నాయకులు సంతోష్, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

భార్యను చితకబాదిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కాగజ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం దుర్గానగర్‌కు చెందిన సీమా మండల్‌ను ఆమె భర్త సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రజిత్ మండల్ చితకబాదినందున ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై కళ్యాణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సీమా మండల్, ప్రజిత్ మండలకు 25ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా దంపతుల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ప్రజిత్ మండల తనకు విడాకులు కావాలని ఆదివారం భార్యతో గొడవ పడ్డాడు. దీంతో గొడవ తీవ్ర స్థాయికి చేరుంది. కోపోద్రిక్తుడైన ప్రజిత్ మండల్ పక్కనే ఉన్న కర్రతో ఆమె కుడి చేయిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా చేయి విరిగిందని వైద్యులు తెలిపారు. సీమా మండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని సిర్పూరు(టి) కోర్టులో హాజరుపరచగా, 15 రోజుల పాటు రిమాండు విధించారని ఎస్సై తెలిపారు.

పంట చేలలోకి వరదనీరు



కమ్మర్‌గాంలో దెబ్బతిన్న పత్తి పంట

పెంచికలపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ప్రవహిస్తున్న పెద్దవాగు, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తే బ్యాక్ వాటర్ కారణంగా పంట చేలు మునుగుతున్నాయి. జిల్లాలో ఎక్కడ వర్షం పడినా ఆ వరద పెద్దవాగులో కలిసి పోయి పంట పొలాలను ముంచెత్తుతోంది. కుమరం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తినా రైతుల్లో అలజడి మొదలవుతుంది. వర్షాకాలం వరద బీభత్సానికి కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ, నవందిగామ, గుండె పల్లి, ఆగర్‌గూడ గ్రామాల్లోని రైతుల పంటలు తుడిచి పెట్టుకు పోతున్నాయి. ఈ వరద కారణంగా ఏటా వందల ఎకరాల్లో పంట నీట మునిగి బురద, ఇసుక మేటలు మిగిల్చి పంట ప్రాణహితలో కలిసి పోతున్నది. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆసిఫాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీ వాసవి పాఠశాలలో 1996-2004 వరకు చదువుకున్న విద్యార్థులు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడు చదువుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిత్రులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకన్నారు. అప్పుడు బోధించిన ఉపాధ్యాయులతో ముచ్చటించిన అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వర్, ప్రసాద్, బాలకిషన్, సతీష్, చిత్రాని, చందన, తిరు మల రావు, శ్రీనివాస్‌తో పాటు పూర్వ విద్యార్థులు మోహిన్, అఖిల్, హరిత్, శ్రీకర్, చందన్, చైతన్య, నిఖిల, మీన, స్రవంతి, మాధవి, మమత పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఆసిఫాబాద్‌లో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బాలభారతి హైస్కూల్ 2002-03 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటాపాటలతో సందడి చేశారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వం చేయూత

సిర్పూర్(టి), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు చేయూతనిస్తోందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రూ.25 లక్షలతో చేపట్టే ఆరె సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారిగా అన్ని హామీలు నెరవేరుస్తూ వస్తుందని చెప్పారు. సంక్షేమ పథకాల అభివృద్ధియే ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈర్ల సత్యనారాయణ, శంకర్, కిశోర్, శంకర్, సోహెల్ అహ్మద్, అబ్దుల్ అకీల్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



బెజ్జూరులో ఉట్టి కొడుతున్న యువకులు

బెజ్జూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహంతో మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో శోభయాత్ర నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే కార్యమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనందోత్సవాల మధ్య యువతీ యువకులు కేరింతల మధ్య ఉట్టికొట్టే కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం గెలుపొందిన విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలో ఆదివారం గోకులష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివప్రసాద్, ఇందులాల్, వాసరామ్, డీటీ శ్యాంలాల్, గోపాల్‌నాయక్, మాత్యలాల్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ క్యాంపు 12లో ఆదివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు, క్యాంపు ప్రజలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

జైనూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవ అవార్డు అందుకున్న తహసీల్దార్ ఆడ బీర్షావ్‌ను ఆదివారం ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న తహసీల్దార్ ఆడ బీర్షావ్‌కు అవార్డు రావడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో నాయకులు సెడ్మకీ భగ్వంత్‌రావ్, గేడాం మారుతి, అడె సోనేరావ్, సత్పత్‌రావ్, దేవరావ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొబ్బరికాయ మొక్కులు.. ధర పెరిగి చిక్కులు

ఒక్కో కాయకు రూ.20 నుంచి 35వరకు పెంపు



బెజ్జూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అసలే శ్రావణ మాసం... నెల రోజుల పాటు పండుగలతో పాటు శుభ కార్యాలూ అధికంగానే ఉంటాయి. పూజలకైనా, శుభ కార్యమైనా ప్రధానంగా ఉండాల్సింది కొబ్బరికాయనే. శ్రావణంలో కొబ్బరికాయ ధరలు భారీగా పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం రూ.20ఉన్న కొబ్బరికాయ ధర ప్రస్తుతం రూ.35కి చేరింది. అయినా కొబ్బరికాయలు మాత్రం నాసిరకంగా, చిన్న సైజులో ఉంటున్నాయని వాపోతున్నారు. కొబ్బరికాయలు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుంటాయి. శ్రావణమాసం వీటి అవసరం మరింత ఎక్కువ ఉంటుంది. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాదు అవసరాలకు సరిపడా కొబ్బరికాయలు దిగుమతి కావడం లేదని జిల్లా వాసులు వాపోతున్నారు. కాయలు చిన్న సైజులో ఉన్నా ధర మాత్రం అధికంగానే ఉంటోందని చెబుతున్నారు. దిగుమతి అయిన కొబ్బరికాయలు సైతం నాలుగైదు రోజుల కంటే ఎక్కువ నిల్వ ఉండదం లేదు. శ్రావణమాసంలో ఎక్కువగా భక్తులు ఆలయాలకు వెళ్లడం, కొబ్బరికాయలు కొట్టడం ఆనవాయితీ. పట్టణ ప్రాంతాల్లో పోచమ్మ బోనాలను ఆషాఢమాసంలో చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో పోచమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ బోనాల వేడుకలను శ్రావణమాసంలో నిర్వహిస్తారు. గ్రామ దేవతలకు బోనాలతో పాటు నైవేద్యం సమర్పించి కొబ్బరికాయలు కొడతారు. ధరలు పెరుగడంతో ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు.

అన్నాభావు సాఠే ఆశయాల సాధనకు పాటుపడాలి

జైనూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అన్నాభావు సాఠే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలోని గణేశ్‌నగర్ కాలనీలో ఆదివారం అన్నా భావు సాఠే విగ్రహానికి జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, అన్నాభావు సాఠే అసోసియే షన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే తదితరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉద్ధవ్ కాంబ్లే మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని అన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. తమ పిల్లను తప్పనిసరిగా చదివించాలని చెప్పారు. అన్నాభావు సాఠేకు భారత రత్న అవా ర్డును ప్రధానం చేయాలని డిమాండ్ చేశారు. అన్నాభావు సాఠే దేశ విదేశాల్లో తను రచించిన సాహిత్యంతో ప్రఖ్యాతి గాంచారని గుర్తు చేశారు. అంతకు ముందు విదర్భ గాయకుడు సంబాజీ ఢగ్గే కవ్వాలి పాటలు అలరించాయి. కార్యక్రమంలో మాంగ్ సమాజం జిల్లా అధ్యక్షుడు దత్త మవాలె, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లే బాబా సహేబ్, మాజీ అధ్యక్షుడు కాంబ్లే అన్నారావ్, జిల్లా నాయకులు, డాక్టర్ ఘాటె రామారావ్, విజయ్ పుల్లారె, కమిటీ సభ్యులు శ్రీహరి కొటంబె, గున్వంత్ కొటంబె, మవాలె భారత్, దుదానె కరణ్, సోపాన్‌రావ్ పుల్లారె, నాగోరావ్ కాంబే భుతాలె వెంకటేష్, భుతాలె కిరణ్, వాగ్మారె హన్మంత్, మాతంగ్ రుషి జిల్లా నాయకుడు పండరీ సూర్యవంశీ, సభ్యులు వామన్ వాగ్మారె, కల్వలె అర్వింద్, సుముక్‌వార్ నర్సింగ్, ఢడెకర్ దయానంద్, ఢడెకర్ శివానంద్, జనార్దన్ నిర్దుడే తదితరులు పాల్గొన్నారు.



అన్నాభావు సాఠే విగ్రహానికి పూల మాలలు వేస్తున్న నాయకులు

చిరుత పులి సంచారం

పెంచికలపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం చిరుత పులి సంచరించడంతో ప్రజల్లో భయాందోళన చెందుతున్నారు. ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్ మాట్లాడుతూ రేంజ్ పరిధిలోని చెడ్వాయి, దరోగపల్లి, పోతపల్లి, బొంబాయి గూడతో పాటు కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని సార్సాల అటవీ సమీప ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుందని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చెడ్వాయి సెక్షన్ పరిధిలో చిరుత పులి పాదముద్రలను గుర్తించామని తెలిపారు. తమ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. అటవీ ప్రాంత సమీపంలోని పంట చేనులకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చుట్టు పక్కల చూసుకుంటూ గుంపులుగా గుంపులుగా వెళ్లాలని చెప్పారు. చిరుత పులి జాడ కనిపిస్తే అటవీ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కాగజ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ అన్వర్ స్కూల్ ఎదుట ఆదివారం సిబ్బంది కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వేలుడుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మాజీ కౌన్సిలర్ లావణ్యశరత్ ముదిరాజ్ అధికారులను కలిసి సమస్యను వివరించారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమల్లోకి టోల్‌గేట్ రాయితీ చార్జీలు


వాంకిడి టోల్ ప్లాజా

- రూ. 3 వేలు చెల్లిస్తే వార్షిక పాస్
- 200 సార్లు ప్రయాణించే అవకాశం

వాంకిడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి టోల్‌గేట్ చార్జీలను స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి రాయితీ పద్ధతి లో అమలులోకి వచ్చింది. వ్యాపారేతర వాహనదారులు రూ. 3వేలు చెల్లించి వార్షిక టోల్ పాస్ తీసుకుంటే జాతీయ రహదారిపై ఉండే టోల్ ప్లాజాల్లో 200 ట్రిప్పులు తిరగవచ్చు. ఈ విధానంతో వేతన జీవులు, సామాన్యుల కార్లు, జీపులు తదితర సొంత వాహనదారులకు ఊరట కలిగింది. టోల్‌చార్జీల భారం తగ్గడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

గతంలో నెలవారీగా..

గతంలో ఒక టోల్‌ప్లాజా వద్ద నెలవారీ పాస్‌కోసం రూ. 350 చెల్లిస్తే ఆనెలలో ఆ టోల్‌ప్లాజా వద్ద మాత్రమే ప్రయాణించే వెసులుబాటు ఉండేది. కానీ కొత్త విధానం ప్రకారం రూ. 3వేలతో వార్షిక టోల్ పాస్ తీసుకున్న వాహనదారులు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై ఉన్న టోల్ ప్లాజాల గుండా ఏడాదిలో 200 సార్లు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ పాస్ ఏడాదిలో 200 ట్రిప్పులు పూర్తయ్యే వరకు చెల్లుబాటవుతుంది.

ఎంతో ప్రయోజనం..

అల్లోజు రవీంద్రచారి, వాంకిడి, వాహనదారుడు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక టోల్ పాస్ జాతీయ రహదారిపై తిరిగే వాహనదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. వాంకిడి మండలం నుంచి ఆసిఫాబాద్, మంచిర్యాల, హైదరాబాద్ వరకు వెళ్లాలంటే ఐదు, ఆరు టోల్ ప్లాజాలు ఉంటాయి. వీటిని దాటాలంటే రూ. 2వేల వరకు ఖర్చు అవుతుంటాయి. ఇలా ఏడాదిలో ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుంటాయి. ఏడాది పాస్ వల్ల వాహనదారులుకు ఇబ్బందులు తొలగిపోతాయి.

వార్షిక పాస్ నిబంధనలు ఇలా..

- ఈ పాస్ ప్రైవేట్, వాణిజ్యేతర కార్లు, జీపులు, వ్యాన్‌లకు మాత్రమేవర్తిస్తుంది.
- జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై ఉన్న టోల్‌ప్లాజాలకుమాత్రమే ఈ పాస్ చెల్లుతుంది.
- హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు టోల్‌ప్లాజా లకు ఈ పాస్ వర్తించదు.
- రాష్ట్ర రహదారులు, స్థానిక సంస్థలు లేదా పార్కింగ్‌లలో ఫాస్టాగ్ లేదా సాధారణ రుసుములు వర్తిస్తాయి.
- పాయింట్ ఆధారిత టోల్ ప్లాజాలలో ప్రతి క్రాసింగ్ ఒక ట్రిప్‌గా, క్లోజ్డ్ టోల్‌ప్లాజాలలో ఒక ఏంట్రీ-ఎగ్జిట్ జత ఒక ట్రిప్‌గా పరిగణిస్తారు.
- పాస్ కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడాది లేదా 200 టోల్‌ప్లాజా క్రాసింగ్‌ల వరకు చెల్లుబాటవుతుంది.
- ఈ పాస్ బదిలీ చేయలేనిది. నమోదు చేసిన వాహనానికి మాత్రమే వర్తిస్తుంది.

ఎలా పొందాలంటే..

ఈనెల 15 నుంచి అమల్లోకి వచ్చిన వార్షిక టోల్ పాస్ పొందాలంటే రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ వెబ్‌సైట్‌లో వాహననంబర్ రిజిస్ట్రేషన్ వివరాలు నమోదు చేసి రూ. 3వేలు రుసుము చెల్లిస్తే సరిపోతుంది. నమోదు చేసిన రెండు గంటల్లో పాస్ అమల్లోకి వస్తుంది. దీనిని జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాల్లో ఉపయోగించవచ్చు. 200 ట్రిప్పుడు ఎప్పుడు పూర్తయితే అప్పుడు మళ్లీ రీచార్జి చేసుకోవాలి.

నీల్వాయి ఎస్సై సస్పెన్షన్

వేమనపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి ఎస్సై సురేష్ సస్పెండ్ అయ్యారు. మండలంలోని సుంపుటం గ్రామానికి చెందిన దంపతుల గొడవలో ఎస్సై కౌన్సెలింగ్ పేరిట భర్తను చితకబాదినట్లు విచారణలో వెల్లడి కావడంతో శనివారం రాత్రి రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝూ చర్యలు తీసుకున్నారు. మండలంలోని సుంపుటం గ్రామానికి చెందిన అల్లం కిష్టయ్య నీల్వాయి గ్రామానికి చెందిన భారత ప్రమీలను 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. ఈ క్రమంలో కిష్టయ్య భార్య ఆరోగ్యం బాగా లేక నీల్వాయి గ్రామంలోని తల్లిగారింటికి 20 రోజుల క్రితం వెళ్లింది. భార్య మళ్లీ రాకపోవడంతో కిష్టయ్య అత్తగారింటికి వెళ్లి తన భార్యను తనతో పంపాలని అత్తమామలతో గొడవపడ్డాడు. దీంతో అత్తామామలు వారం రోజుల క్రితం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో కిష్టయ్యపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎస్సై సురేష్ కౌన్సెలింగ్ పేరుతో కిష్టయ్యను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకుని విపరీతంగా కొట్టడంతో అనారోగ్యం పాలయ్యాడు. బాధితుడైన కిష్టయ్య ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంచిర్యాల జిల్లా జైపూర్ ఏసీపీకి ఈనెల 11న ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఏసీపీ వెంకటేశ్వర్లు ఎస్సై సురేష్‌పై విచారణ జరిపి రామగుండం సీపీకి నివేదిక అందించారు. దీంతో రామగుండం సీపీ ఎస్సై సురేష్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి

ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే మండళ్ల వివరాలు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రత, బందో బస్తు కోసం పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పారు. మండపాల వద్ద వలంటీర్లు కమిటీ సభ్యులు 24 గంటలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలకు అధిక శబ్దం చేసే డీజేలకు అనుమతి లేదని చెప్పారు. వెబ్‌సైట్‌లో వినాయక మండపం వివరాలు, వినాయక చదివి మొదలు, నిమజ్జన తేదీ, సమయం, ప్రయాణించే దారి, మండపం ప్రదేశం, ప్రదేశం ఓనర్ వివరాలు, గణపతి విగ్రహ ఎత్తు, మండపం ఎత్తు, నిమజ్జనం ప్రదేశం, తదితర సమాచారాన్ని పొందుపర్చాలని సూచించారు. గణపతి తీసుకెళ్లే వాహనం వివరాలు, డ్రైవర్, యజమానికి వివరాలు కూడా పొందు పర్చాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత కేటాయించాలని తెలిపారు. ఎలాంటి అవ్య వసర సమయంలోనైనా పోలీసు యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

నెన్నెల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోనంపేట గ్రామానికి చెందిన దుర్గం తార (59) అనే వివాహిత ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఇంట్లో కూలర్ బంద్ చేసే క్రమంలో షాక్ కొట్టి కింద పడింది. పొరుగు వారు గమనించి కర్రతో కొట్టి పక్కకు తొలగించారు. అప్పటికే మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వర్షానికి ఇళ్లు ఉరిసి ఇంట్లో నేల తడిగా ఉండటం, కూలర్ బాడీ ఇనుపది కావడంతో కరెంటు షాక్ వచ్చిందని భావిస్తున్నారు. భర్త బాపు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. తారకు వికలాంగురాలైన కూతురు ఉంది. ఆమెకు తారనే సపర్యలు చేసేది. ఇక తాను ఎలా బతికేదని అంటూ కూతురు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

చేపల వేటకు వెళ్లి యువకుడు..

జన్నారం, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల కొలాంగూడకు చెందిన ఆత్రం భీము(35) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ఆత్రం భీము కొత్తపల్లి గ్రామ శివారులోని చెరువు మత్తడి వద్ద ఆదివారం ఉదయం చేపల వేటకు వెళ్లాడు. భీము కొన్నేళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతన్నాడు. ప్రమాదవశాత్తు అతనికి చేపలుపట్టే క్రమంలో మూర్ఛవ్యాధి రావడంతో నీళ్లలో పడిపోయి మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. భీముకు తల్లి లేతిబాయి, తండ్రి అర్జున్ ఉన్నారు.

కుమరం భీం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని కుమరం భీం ప్రాజెక్టులోకి వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. కుమరం భీం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 243 మీటర్ల గాను ప్రస్తుతం 237 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి వేయి క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఒక గేటు పైకి ఎత్తి వెయ్యి క్యూసెక్కుల వరద నీరు బయటికి వదులుతున్నారు. అలాగే వట్టి వాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మ్టం 239.5 మీటర్లు కాగా ప్రస్తుతం 237.550 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 3,600 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో రెండు గేట్లు పైకి ఎత్తి 3,610 క్యూసెక్కుల వరద నీటిని బయటకు వదులుతున్నారు.

పెన్‌గంగాకు వరద ఉధృతి


వెంకట్రావుపేట వంతెనకు ఆనుకుని ప్రవహిస్తున్న పెన్‌గంగా

సిర్పూర్(టి), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వెంకట్రావుపేట సమీపంలోని పెన్‌గంగాకు వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తోడు అక్కడి ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో ఆదివారం వెంకట్రావుపేట- పోడ్సా వంతెనకు ఆనుకుని ప్రవహిస్తోంది. వరద పరిస్థితిని ఎస్సై కమలాకర్ పరిశీ లించారు. టోంకిని, పారిగాం, లక్ష్మీపూర్, కర్జపల్లి, తదితర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఘనంగా తీజ్ వేడుకలు


కైరిగూడలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

రెబ్బెన, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన కైరిగూడలో ఆదివారం తీజ్ వేడుకలను బంజారా, లంబాడా మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ కార్యక్రమాలు నిర్వహించి తీజ్ వేడుకలు చేపట్టారు. అనంతరం జిల్లా నాయకుడు అజ్మీర శ్యాం నాయక్ మాట్లాడుతూ మన పండుగలు, మన సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ సుబ్బారావు, ఇదల్, రమేష్, గణపతి, శంకర్, రవీందర్, వసంత్ రావు, వెంకట్రావు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకొని భావితరాలకు అందించాలని సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. మండలంలోని కోసార భవానీనగర్‌లో ఆదివారం నిర్వహించిన తీజ్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంజార జాతి సాంప్రదాయం చాలా గొప్పదని అన్నారు. బంజారా సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకొని భావితరాలకు అందజేయా లన్నారు. అనంతరం సంప్రదాయ రీతిలో నృత్యాలు చేపట్టారు. కార్యక్రమంలో బంజార నాయకులు ఇందులాల్, అంబారావు, రఘునాథ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంనగర్‌లో ఆదివారం తీజ్ ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో, ఆటల పాటలతో మహిళలు నృత్యాలు చేశారు. ఆదేవిధంగా బంజారాల ఆరాధ్య దైవమైన అమ్మవారి ఆశీస్సులు ఉండాలని వారు ప్రార్థించారు. అందరిని సుఖంగా ఉంచాలని వారు అమ్మవారి కోరుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ జాదవ్ మోహన్ నాయక్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు జాదవ్ గణపత్ నాయక్, కాంగ్రెస్ నాయకులు విక్రం చవ్హాన్, కారోబారి హరి, రామేశ్వర్, సుభాష్, వసంత్‌రావ్, లంబాడి ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్ జాదవ్, మహిళలు పాల్గొన్నారు.


కోసార గ్రామంలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న బంజారాలు



సీఎండీని కలిసిన గిరిజన ఉద్యోగుల కమిటీ


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

జైపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సెంట్రల్ కమిటీ సభ్యులు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం, డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రులను హైద్రాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు దరావత్ పంతుల, జనరల్ సెక్రటరీ భుక్య నాగేశ్వర్‌రావుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియను వివరించి రోస్టర్ వెరిఫికేషన్, ప్రమోషన్ పాలసీ వంటి గిరిజన ఉద్యోగుల సమస్యలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్‌రావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తిరుమల్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్, వైస్ ప్రెసిడెంట్ భుక్య వెంకట్‌రాం పాల్గొన్నారు.

కార్మిక కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కార్మిక కుటుంబాలు నివసించే కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 9 కాలనీ, నస్పూర్ డిస్పెన్సరీ ప్రాంతాల్లో ఆదివారం బస్తీబాట నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో క్వార్టర్లలో ఉన్నటువంటి కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయన్నారు. ముఖ్యంగా డ్రైనేజీలు ఎత్తుగా, క్వార్టర్లు కిందకి ఉండడంతో వర్షపు నీరు మొత్తం ఇళ్లలోకి వచ్చిందని తెలిపారు. ఆయా సమస్యలు ఏరియా జీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గుళ్ల బాలాజీ, బ్రాంచ్ నాయకులు సాయిళ్ల శీను, వెంకట్ రెడ్డి, మిడివెల్లి శ్రీనివాస్, పెరుక సదానందం, శ్రీపతి బానేష్, ప్రతాప్, తోడే సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోక పోవడం సరికాదు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ

మందమర్రిటౌన్, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిలో ఇటీవల జరిగిన ప్రమాదంలో రాసపల్లి శ్రావణ్‌కుమార్ అనే ఉద్యోగి మృతి చెందాడని, దీనికి మైనింగ్ సర్దార్‌ను బాధ్యుడిని చేస్తూ విధుల్లోకి తీసుకోక పోవడం సరికాదని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. ఏఐటీయుసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2 షిఫ్ట్‌లో గని ప్రమాదంలో జరిగినప్పుడు అండర్‌మేనేజర్ నుంచి మొదలు కొని ఓవర్‌మెన్ సర్దార్ వరకు అక్కడ విధులు నిర్వహిస్తుంటారని చెప్పారు. కేవలం సర్దార్ పేరుతో ఇంక్వైరీతో విధులకు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఉత్పత్తి సాధించాలని ఇష్టారాజ్యంగా షిప్టులు నడిపారని అన్నారు. అనుకోకుండా ఉద్యోగి మరణిస్తే ఒక్కడినే బాధ్యుడిని చేయడం సరికాదన్నారు. ఆషిప్టులో ఉన్న మిగితా వారిపై చర్యలకు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ యూనియన్ ఆందోళన చేపడుతుందన్నారు. దీనికి సంబం ధించి బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎంతో పాటు ఇతర అధికారులు ఎందుకు బాధ్యత వహించ కూడదని అన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే వచ్చి గనులు పరిశీలించడం కాదని చెప్పారు. ఏరియా ఏఎస్‌వో నుంచి మొదలుకొని కింది స్థాయి అధికారులు పర్యవేక్షణ చేపడితే ప్రమాదాలు జరుగవని చెప్పా రు. సింగరేణిలో సంస్థ అభివృద్ధితో పాటు ప్రమాదాలకు సంబంధించి అధికారులు అను సరిస్తున్న విధానాలపై కూడా త్వరలో పోరా టాలకు పూను కుంటామని తెలిపారు. సమావేశంలో బ్రాంచి సెక్రటరీ కంది శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ నాయకులు గోపతి సత్యనారాయణ, విక్రమ్ సింగ్, కాసం సమ్మయ్య, మంద రాజీర్, బుక్య తిరుపతి, రాజేందర్, ఓదెలు, కొండయ్య పాల్గొన్నారు.

వైద్యం వివరాలు కార్మికుడికి తెలియజేయాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేయించుకున్న వివరాలను కార్మికుడికి తెలియజేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు . సీతారామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కోరారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డు సమావేశంలో వారిద్దరు పాల్గొని పలు విషయాలను బోర్డు దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుడు ఉద్యోగ విరమణ చేసిన రోజునే సీపీఆర్ఎంఎస్ కార్డు అందించాలని, వైద్యం చేయించుకున్న తరువాత మిగతా బాలన్స్‌ను వెల్లడించాలని చెప్పారు. ఇప్పుడు చెల్లిస్తున్న 8 లక్షల రూపాయల నుంచి 10 లక్షలకు పెంచాలని, కంపెనీ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నప్పుడు 40 శాతం రికవరీ చేయొద్దని కోరారు. హైదరాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఏయిమ్స్ ఆస్పత్రిలో సీపీఆర్ఎంఎస్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. సమావేశంలోసీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణకు ఉద్యమించాలి


మాట్లాడుతున్న సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని పరిరక్షించుకునేందుకు ఉద్యమించాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి మనుగడ, కార్మికుల హక్కు సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించే సమయం ఆసన్నమైందన్నారు. గత 15 సంవత్సరాల కాలంలో టీబీజీకేఎస్ , ఇతర యూనియన్‌లు కార్మికులకు చేసిందేమి లేదన్నారు. జాతీయ కార్మిక సంఘాల చందానే టీబీజీకేఎస్ కూడా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫల మైందన్నారు. ఓపెన్‌కాస్టులకు వ్యతిరేకమని ప్రకటించిన కేసీఆర్ భూగర్భ గనులు , కార్మికుల సంఖ్యను తగ్గించి ఓపెన్‌కాస్టులను పెంచి ఉత్తర తెలంగాణ ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సింగరేణిని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కార్మికుల పట్ల సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంలో విఫలమైందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అన్ని యూనియన్‌లు ఉద్యమించాలని సూచించారు. ఈ నెలాఖరులో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని యూనియన్‌ల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జనార్దన్, రాజన్న, జైపాల్ సింగ్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం ఎన్నిక

హాజీపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంచిర్యాల మున్సిపాలిటి కార్పొరేషన్ ఏర్పడగా అందులో విలీనమైన హాజీపూర్ మండలంలోని వేంపల్లి,గుడిపేట, ముల్కల్ల, నంనూర్, నర్సింగాపూర్ మునిసిపల్ కార్మికులు తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘంలో చేరారు. ఈ ఐదు గ్రామాలు కలిపి నూతనంగా అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు దేవి సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సంఘం ఎన్నికల్లో ఐదు గ్రామాలకు అధ్యక్షులుగా చిప్పకుర్తి అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరి మల్లేశ్, కోశాధికారిగా గాడిపెల్లి స్వామి, చిప్పకుర్తి మహే oదర్, ఉపాధ్యక్షులుగా గజ్జల రమేశ్, మిట్ట సంపత్, సలహాదారుడిగా చీమల రాజుకుమార్, గుడెల్లి వెంకటస్వామిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవి సత్యం మా ట్లాడుతూ మున్సిపల్ కార్మికుల హక్కులను కాపాడేందుకే తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం కృషి చేస్తుందని కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నేడు జిల్లాలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో సోమవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటించనున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు బెల్లంపల్లిలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, బాలుర పాఠశాల, మధ్యాహ్నం బెల్లంపల్లి పట్టణంలోని 21వ వార్డులో పర్యటించనున్నారని పేర్కొన్నారు. సాయంత్రం మంచిర్యాలలోని సాయికుంటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకుంటారని తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డు.. పరిశీలించిన అధికారులు

నెన్నెల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : భారి వర్షాలకు జెండావెంకటాపూర్ సమీపంలోని సీసీ రోడ్డు దెబ్బతిన్నది. కింది నుంచి బుంగ పడి మట్టి మొత్తం కొట్టుకపోయింది. పైన సీసీ రోడ్డు మాత్రమే మిగిలింది. పై నుంచి వాహనాలు వెలితే కూలిపోయే ప్రమాదం ఉంది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ ఆదివారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అటువైపుగా ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు. వెంటనే మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ అధికారును ఆదేశించామని ఎంపీడీవో తెలిపారు. అటువైపుగా ఎవరూ వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

జన్నారం, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): హిందువాహిని ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను మండలంలో శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టికొట్టి శ్రీకృష్ణగోపికల వేషాధారణలో పలువురిని ఆకర్షించారు. అనంతరం ఉట్టికొట్టి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర చంద్రశేఖర్, రాజశేఖర్, జక్కు భూమేశ్, మధుసూదన్‌రావు, భూమన్న, శాంతాభాయి పాల్గొన్నారు.

వాగును పరిశీలించిన ఎస్ఐ


వాగును పరిశీలిస్తున్న ఎస్సై

మందమర్రిరూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుగులపేట గ్రామంలోని పెద్దవాగు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆదివారం పట్టణ ఎస్ఐ రాజశేఖర్ వాగును పరిశీలించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు, ప్రజలు వాగును దాటవద్దని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ కడారి జీవన్‌కుమార్, గ్రామస్థులు ఉన్నారు.

పొదుపుతో భవిత భద్రం

- కిషోర బాలికలతో ప్రత్యేక ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు
- 15-18 ఏళ్ల బాలికలందరికీ సంఘాల్లో సభ్యత్వం
- యువతులకు సామాజిక అంశాలపై చైతన్యం
- వృద్ధులు, దివ్యాంగులతో నూతన సంఘాలు
- జిల్లాలో కొత్తగా మరో 30వేల మందిని చేర్చుకోవడమే లక్ష్యం




మండల అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

నెన్నెల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక ఉన్నతి కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నారీ శక్తిని బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాల్లో కోటి మందిని చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 18 నుంచి 60 ఏళ్లలోపు వారికి మహిళా సంఘాల్లో ప్రభుత్వం రుణాలిచ్చి ప్రొత్సహించి ఆర్థికంగా బలోపేతం చేస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కిషోరబాలికలు, వృద్ధులకు సైతం అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. మంచిర్యాల జిల్లాలో 10,444 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 1,16,211 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో కొత్తగా ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేసి మరో 30 వేల మందిని చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇప్పటికి సంఘాల్లో చేరని వారితో పాటు కిషోర బాలికలు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులను చేర్చుకునేందుకు సెర్ప్ ప్రణాళికలు రూపొందించింది. బ్యాంకు లింకేజీలు, సీఐఎఫ్, స్త్రీనిధి రుణాలు వంటి ఆర్థిక సాయం చేయనున్నారు. సంఘాల్లో చేరిన మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు వారి కుటుంబాల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని అధికారులు అంటున్నారు. ఈ మేరకు జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు ఇటీవల జిల్లా కేంద్రంలో మండల స్థాయి అధికారులతో సమా వేశం నిర్వహించారు. ప్రత్యేక సంఘాల ఏర్పాట్లు, నూతన సభ్యత్వాల నమోదు వాటి విధి విధానాల గూర్చి చర్చించారు. మండలాల్లో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఈ నెల 30లోగా సంఘాల ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నారు.

పొదుపు.. సామాజిక చైతన్యం..

కిషోర బాలికలతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఆర్థిక పరమైన భద్రత కల్పించడతో పాటు చిన్న వయసులోనే బాలికలకు ఆర్థిక స్థిరత్వం లభించేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా పొదుపు, ఆర్థిక నిర్వహణ చిన్నవయసులోనే పెట్టుబడులు పెట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. 15 నుంచి 18 ఏళ్లలోపు బాలికలతో పొదుపు చేయించి వారికి ఆర్థికపరమైన భద్రతపై అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

వారితో ప్రతినిత్యం సమావేశాలు నిర్వహించి సామాజిక అంశాలపై సైతం అవగాహన కల్పించనున్నారు. చిన్న వయసు లోనే వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించడం, బాలికలు విద్యకు దూరం కాకుండా చూడటం, లింగపరమైన హింస-రక్షణ, రుతు సంబంధిత ఆరోగ్యం-సవాళ్లు, ఎదిగే వయసులో తీసుకునే పౌష్టికాహారం, ఆర్థిక అసమానత, డిజిటల్ పరి జ్ఞానం, సామాజిక కట్టుబాట్లు, మహిళా చట్టాలపై అవగాహన, సాధికారతపై చైతన్య పరిచేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొత్త సంఘాల నిర్మాణం ఇలా...

నూతన సభ్యత్వ నమోదు, కొత్త సంఘాల ఏర్పాటును ప్రతి ష్టాత్మకంగా చేపట్టనున్నారు. ఆగస్టు 12 నుంచి 30 వరకు వరకు కొత్త సంఘాల నిర్మాణం పూర్తి చేసేలా పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. స్వయం సహాయక సంఘాల్లో అర్హులందరినీ సభ్యులుగా చేర్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం పెద్దఎత్తున కసరత్తు ప్రారంభించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న సాధారణ (18-60 సంవత్సరా లు)మహిళలు, వృద్ధ మహిళలు (60 ఏళ్లు పైబడినవారు), దివ్యాంగులను ఓటరు జాబితా, జాబ్ కార్డులు, రేషన్‌కార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి అర్హులైన వారిని గుర్తించనున్నారు. గ్రామాల్లో బీఎల్‌వోల సహకారంతో ఓటరు జాబితాను పరిశీలిస్తారు.

సంఘాల్లో లేని సభ్యుల వాస్తవ స్థితి తెలుసుకుంటారు. వలస వెళ్లారా.. మరణించారా... వివాహితులా... రెండేసి చోట్ల ఓటు ఉందా... ఉద్యోగస్థులా.. వంటి వివరాలను సేకరించి, ఏది కానప్పటికీ సంఘంలో సభ్యులుగా ఎందుకు చేరలేదనే అంశంపై చర్చిస్తారు. కిషోర బాలికల వివరాలు ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్నాయి. వాటితో పాటు పాఠశాలలు, కాలేజీల నుంచి వివరాలు సేకరించనున్నారు. రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్ల జాబితా ద్వారా వృద్ధులను గుర్తిస్తారు. వారి వివరాలను సెర్ప్ పోర్టల్‌లో నమోదు చేసి, ఎస్‌హెచ్‌జీల్లో లేని వారిని గుర్తించి వారికి సంఘాల గురించి పూర్తి అవగాహన కల్పిస్తారు. నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల స్థాయిలో సీసీ, ఏపీఎంలు పర్యవేక్షిస్తారు.

ఈ నెల 30 వరకు స్పెషల్ డ్రైవ్ : డీఆర్‌డీవో కిషన్



కిషోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులను కొత్త ఎస్‌హెచ్‌జీలు ఏర్పాటు చేసి అర్హులందరినీ చేర్చుకుంటాం. నూతన గ్రూపుల ఏర్పాటు పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఇప్పటికే డీపీఎంలు, ఎంపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య ఆఫీస్ బేరర్లతో జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వ హించి దిశానిర్దేశం చేశాం. మండలాల్లో శిక్షణ తరగతులు ప్రారంభించాం. వివరాల సేకణ మొదలైంది. నూతన గ్రూపుల ఏర్పాటు కోసం ఈ నెల 30 వరకు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.

వృద్ధాప్యంలో అవసరాలు తీర్చేలా...

ప్రస్తుతం 60 ఏళ్లలోపు మహిళలే సంఘాల్లో కొనసాగుతున్నారు. ఆపై వయసున్న వారిని సైతం ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేసి చేర్చుకోనున్నారు. వృద్ధులు తమ కుటుంబాల కోసం జీవితాంతం కష్టపడి వాటిని తన కన్న వారికి పంచి ఇచ్చి చరమాంకంలో అష్టకష్టాలు పడుతున్నారు. కుటుంబాల్లో ఎదురయ్యే అవమానాలు, విసుగు, ఆర్థిక అభద్రత, ఆరోగ్య క్షీణత, భయం, ఒంటరితనం, భవిష్యత్తుపై ప్రణాళిక లేక పోవడం, నియంత్రణ కోల్పోవడం, ఆత్మగౌరవం దెబ్బతినడం తదితర వృద్ధుల సమస్యలను గుర్తించారు. వీటికి పరిష్కార మార్గంగా ప్రత్యేక స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ముదిమి వయసులో పొదుపు ఎలా ఉపయోగ పడుతుందో వివరించి సంఘాల్లో చేర్చుకోనున్నారు. వారందరికీ ఆరోగ్యం, మానసిక స్థైర్యం, సామాజిక భద్రతపై శిక్షణ ఇవ్వనున్నారు. దివ్యాంగుల గ్రూపుల్లో మహి ళలే కాకుండా పురుషులకు కూడా చోటు కల్పిస్తున్నారు. పది మందితో గ్రూపు ఏర్పాటు చేసి వారి హక్కులు వివరించడం, ఏటీఆర్ సేవలు, ఉపకరణల పంపిణీ, రుణ సౌకర్యం గురించి అవగాహన కల్పించనున్నారు.

గిరిజనులకు దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ

దండేపల్లి ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బిల్యగూడ చెందిన నిరుపేద గిరిజన కుటుంబాలకు మంచిర్యాల ఆసిఫాబాద్ జిల్లాల చెందిన కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆది వారం దుప్పట్లు, దోమ తెరలు, రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. వర్షా కాలంలో గిరిజనులు ఇబ్బందులు పడుతున్న దృష్టా వారిని దోమల నుంచి రక్షించే దుకు వారికి దుప్పట్లుతో దోమ తెరలు అందజేశారు. ఈకార్యక్రమంలో కమ్మ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కోలి విష్ణువర్ధన్‌రావు, అధ్యక్షులు వడ్డే వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంగవరపు వెంకటేశ్వరరావు, సమన్వయకర్త బోతనపల్లి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సూపనేని చిత్తరంజన్‌దాస్, కమిటీ సభ్యులు గంగినేని నాగేశ్వర్‌రావు, గద్దె శ్రీనివాస్, పోట్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల లయన్స్ క్లబ్, హైద్రాబాద్ శ్రీకర ఆసుపత్రి సహకారంతో మంచిర్యాలోని చున్నంబట్టివాడలోని లయన్స్ క్లబ్ భవన ప్రాంగణంలో ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ రాకేష్ దాదాపు 150 మందికి ఎముకల కీళ్ల నొప్పుల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళి, సుధాకర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వినయ్‌కుమార్, శ్రీనివాస్, మహేందర్, సురేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

మల్యాల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన చందు అనే యువకుడు రెండు నెలల క్రితం తన సెల్‌ఫోన్‌ను పోగోట్టుకోగా ఆదివారం పోలీసులు పట్టుకొని అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్ ట్రాక్ చేయగా సెల్‌ఫోన్ ఆచూకీ లభించింది. దీంతో ఆదివారం బాధితుడు చందుకు ఫోన్‌ను ఎస్సై నరేశ్‌కుమార్ అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణకుమార్ తదితరులు ఉన్నారు.

‘సహకారం’ లేనట్టేనా..

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ సర్కారు పీఏసీఎస్‌లను విస్తరించాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు ఈ నెల 14న ఉత్తర్వులు సైతం జారీ చేసింది.

నూతన విధానానికీ మంగళం..

సహకార సంఘాల ఏర్పాటుకు సంబంధించి గతంలో కేంద్ర ప్రభుత్వం ఒక జాతీయ సహకార విధానానికి శ్రీకారం చుట్టింది. దీని ప్రకారం ప్రతి గ్రామానికి ఒక ప్రాథమిక సహకార సంఘం, ఒక మత్స్య సహకార సంఘం, ఒక పాల ఉత్పత్తి సహకార సంఘం ఉండాలనేది ఈ నూతన సహకార విధానం ఉద్దేశ్యం. కేంద్ర సహకార శాఖ మంత్రిగా అమిత్‌షా బాధ్యతలు చేపట్టిన తరువాత ఏర్పాటు చేసిన జాతీయ సహకార సదస్సులో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాలకు కూడా అమిత్‌షా సూచనలు చేశారు. గత ప్రభుత్వం దీన్ని పట్టించుకోవడంతో నూతన విధానానికి మంగళం పాడినట్లయింది. ఈ విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

విభజింపుతోనే సేవలు విస్తృతం...

వ్యవసాయంలో రైతులకు అన్ని రకాలుగా వెన్నుదన్నుగా ఉండే సహకార సంఘాల సేవలను విస్తరిస్తుండటంతో మరింతగా ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కొత్తగా 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏ ఈవోలను నియమించింది. అదే తరహాలో రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీలను కూడా విభజించే నిర్ణయానికి రావడం గమనార్హం. ఒక్కో సొసైటీలో వేలాది మంది రైతులు సభ్యులుగా ఉండగా, ఏ అవసరం వచ్చినా క్యూలు కట్టాల్సి వస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా, వాటి పదవీ కాలం వాస్తవంగా 2025 ఫిబ్రవరి 15తో ముగిసింది. దీంతో ప్రభుత్వం ఆరు నెలలపాటు గడువు పొడిగించింది. ఆ గడువు కూడా ఈ నెల 15తో ముగిసింది. ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లకుండా మళ్లీ గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. సంఘాల ఎన్నికలకు ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ కారణంగా సంఘాల పదవీ కాలాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వం సహకార సంఘాలను విస్తరించాలనే నిర్ణయానికి వచ్చినందున జిల్లాలో మరో 16 సంఘాలు కొత్తగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అప్పుడు జిల్లాలోని రైతులకు సహకార సంఘాల సేవలు సైతం విస్తరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఓరియంట్ ఎన్నికలపై వీడని చిక్కుముడి

- కొనసాగుతున్న వాయిదాలు
- కోర్టు ఆర్డర్ బేఖాతర్
- గుర్తింపు సంఘం ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి



దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ

కాసిపేట, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ ఎన్నికల నిర్వహణపై చిక్కుముడి వీడడం లేదు. ఈ నెల 19న గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి 20న ఎన్నికల ఫలితల నివేదికను హైకోర్టుకు అందజేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదిలాబాద్ డీసీఎల్ శనివారం అర్ధరాత్రి ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా సర్క్యూలర్ విడుదల చేయడం అందరిని ఆశ్చ ర్యానికి గురి చేసింది. ఈ ఏడాది జనవరి 18న మొద లైన ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే ఐదు సార్లు ఎన్నికల నిర్వహణ తేదీలు వాయిదా పడడం కంపెని చరిత్రలో ఇదే మొదిసారి కావడం విశేషం. దీనిపై కార్మికులు సై తం అసహనం వ్యక్తం చేస్తున్నారు. కంపెనీలో 266 మంది కార్మికులు ఉండగా ఇందులో 9 మంది ట్రైనీ కార్మికులు ఉన్నారు. కార్మిక చట్టం నిబంధనల ప్రకారం 90 రోజులు విధులు నిర్వహించిన కార్మికులను గతంలో ఎన్నికల కమిషన్ ఓటు హక్కు కల్పించింది. కానీ నేడు 9 మంది కార్మికులు ట్రైనింగ్‌లో ఉన్నారని ఓటు హక్కు తొలగించడంపై 9 మంది కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు డీసీఎల్ ఎన్నికలను వాయిదా వేయడం పై కార్మిక వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

క్యాంప్‌లోనే కార్మికులు...

ఓరియంట్ ఎన్నికల్లో గెలుపు ఓటములను ప్రభావం చేసే క్యాంప్ రాజకీయాలను ఇరువర్గాలు ప్రోత్సహి స్తున్నాయి. వీటిలో ఉన్న రెండు ప్రధాన కార్మిక సంఘాలు కొంత కార్మికులను యాత్రల పేరుతో క్యాంప్‌నకు తరలించారు. ఒక్కొక్కవర్గం 60 మంది చొప్పున క్యాంప్‌కు తరలించినట్లు సమాచారం ఈ నెల 19న జరుగాల్సిన ఎన్నికలు ఈ నెల 26 వరకు ఎన్నికలు నిర్వహించేది లేదని కార్మికశాఖ విడుదల చేసిన సర్క్యూలర్ వద్ద క్యాంప్‌లో ఉన్న కార్మికుల నిర్వహణ కార్మిక సంఘం నాయకులకు ఆర్థిక భారంగా మారింది. దీంతో కోర్టు ఆర్డర్‌తో ఓరియంట్ ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి. ఓరియంట్ ఎన్నికల నిర్వహణ ఏ మేరకు ఎటు దారి తీస్తుందోనని కార్మిక సంఘాలు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైన కోర్టు నిర్దేశం ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని సగటు కార్మికులు కోరుతున్నారు.

మండలంలో పంట నష్టం సర్వే

నెన్నెల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ అధికారులు మండలంలో ఆదివారం పంట నష్టం సర్వే చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ఏఈవోలు క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరించారు. 207 ఎకరాల్లో వరి, 330 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నదని ప్రాథమికంగా అంచనాకు వచ్చామని ఏవో పుప్పాల సృజన తెలిపారు. నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని చెప్పారు. నష్టపోయిన రైతుల వారిగా జాబితా రూపొందించాల్సి ఉందన్నారు. ఏఈవో రామ్‌చందర్ ఉన్నారు.

వార్డు అధికారుల నియామకం

మందమర్రిటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వార్డుల్లో వరద నీరు చేరితో సమస్య పరిష్కారం కోసం వార్డు ఆఫీసర్‌లను నియమించామని మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు పలు వార్డుల్లో వరద నీరు చేరడంతో ప్రజలు తమకు ఫోన్ చేయడంతో వరద నీరును తొలగించామన్నారు. పాల చెట్టు నుంచి మొదలుకుని కార్మెల్ హైస్కూల్, పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుకు రెండు వైపుల నీరు నిలిచిపోవడంతో జేసీబీతో వరద నీటిని తొలగించామని దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పాయన్నారు. త్వరలోనే సింగరేణి వార్డుల్లో కూడా వరద నీరు సమస్య ఉన్నందున స్థానిక జీఎంతో మాట్లాడుతామని తెలిపారు. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే తమకు ఫోన్ చేయాలన్నారు. 24 వార్డులకడ సంబంధించి 24 వార్డు ఆఫీసర్లను నియమించి వారి ఫోన్ నెంబర్లనుమున్సిపల్ కార్యాలయంలో ఉంచామని తెలిపారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 22 వరకు మెడ్చల్ జిల్లా గాజుల రామారంలో నిర్వహించే 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని మాలగురిజాల గ్రామంలో రాష్ట్ర 4వ మహాసభల పోస్ట ర్లను విడుదల చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సభల్లో చర్చిస్తారని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించేందుకు సభలు నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ పార్టీ పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో ఏళ్లుగా సమస్యల పరిష్కరం కోసం పోరాడుతూ ముందుకు వెళ్తుందన్నారు. భూమి కోసం భుక్తి కోసం నిరుపేద ప్రజల విముక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన పార్టీ సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు మేకల రాజేశం, గంగారాం, తిరుమలేశ్, పోచం, తిరుపతి, దేవయ్య లు పాల్గొన్నారు.

తాండూర్ : ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ మండలం మహారాజాగా ర్డెన్‌లో జరిగే సీపీఐ రాష్ట్ర 4వ మహా సభలను విజయవంతం చేయాలని సీపీ ఐ మండల కార్యదర్శి కొండు బానేష్ పే ర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రం లోని భగత్‌సింగ్ భవన్‌లో సభల పోస్టర్ల ను విడుదల చేసి మాట్లాడారు. ఈ మ హాసభలకు వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయ్య మొగిలి, మలిశెట్టి సత్యనారాయణ, వాసాల నాగరాజు, పట్టి శంకర్, ఆనంద్, లక్ష్మీ, గోపాల్, తిరుపతి, భీమక్క, సన్యాసి, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎఫ్ఎల్ఎన్ మేళా

తాండూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగళ్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ, టీచింగ్ లెర్నింగ్ మేళా నిర్వహిస్తున్నామని ఎంఈవో మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన అభ్యాసన పరికరాలు ఉపాధ్యాయులతో తయారు చేయబడి మేళాకు తీసుకువస్తారని తెలిపారు. మేళాను విజయవంతం చేయాలన్నారు

అధికార పార్టీ అండదండలతో భూ కబ్జా

న్యాయం చేయాలని బాధితురాలి వేడుకోలు

కాసిపేట, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకుల అండదండలతో తన కోడలు భూ కబ్జా చేసి ఇబ్బందులకు గురి చేస్తోందని కాసిపేట మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు జనుప మల్లమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం కాసిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాసిపేట శివారులోని 213 సర్వే నెంబర్‌లో రెండెకరాలపై చిలుకు భూమి తన కొడుకు జనుప రాంచందర్ పేరు మీద పట్టా ఉందన్నారు. కొన్నేళ్ల క్రితం కొడుకు మృతి చెందాడని, ఆ భూమి నుంచి సింగరేణి రహదారి వేసేందుకు ఎకరం భూమిని తీసుకుందన్నారు. నష్టపరిహారం చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం తనను పిలిచినప్పుడు అధికార పార్టీ నాయకులు, కోడలు అడ్డుకొని నష్టపరిహారం ఇవ్వకుండా నిలిపివేశారని వృద్ధురాలు వాపోయింది.

మిగిలిన ఎకరం భూమిని బలవంతంగా కబ్జా చేసుకొని తనపై దాడులు చేస్తూ భయాభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. వృద్ధురాలితో ఆమె కూతురు భాగ్య ఉంది.

శిల్ప కళ భళా..

- సుద్ద పాలరాయి, సిమెంటుతో బొమ్మలు
- ప్రతిభ చాటుతున్న మహేందర్


మహేందర్ ఇంటికి వేసిన బొమ్మ

జైపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మనిషిలో ఏదో ఒక కళ దాగి ఉంటుంది. పట్టుదల, కృషి, అంకిత భావంతో పనిచేస్తే వాటిలో రాణించవచ్చు. శిక్షకులు, సలహాలు, సూచనలతో సాధన చేస్తే మరింత ప్రావీణ్యం పొందొచ్చు. అలాంటిది ఎలాంటి శిక్షణ లేకుండా పట్టుదల, కృషితో శిల్పకళా రంగంలో రాణిస్తున్నారు జై పూర్ మండలంలోని కుందారం గ్రామానికి చెందిన చిలకాని మహేందర్. ఒక రోజు టీవీలో సుద్ద ముక్కలతో బొమ్మలు తయారు చేయడంపై ప్రసారమైన కథనంతో ప్రేరణ పొందాడు.

సుద్దముక్కలతో ప్రారంభమైన కళారూపాల తయారీ ఇప్పుడు అందరినీ అబ్బురపరిచేలా కళాఖండాలను తీర్చిదిద్దే స్థాయికి చేరింది. ఐటీఐలో ఎలక్ట్రీషియన్ వృత్తి విద్య కోర్సు చేసిన మహేందర్ ఆసక్తి ఉన్న కళారంగంపై మక్కువ పెంచుకున్నారు. అనతి కాలంలోనే ఎన్నో వైవిధ్యమైన బొమ్మలను తయారు చేసి ఆహా అనిపిస్తున్నాడు. సుద్ద ముక్కలతో గణపతి, హనుమాన్, బుద్ధుడు, గధ, గ్లోబు, క్రికెట్ బ్యాట్ లను తయారు చేశారు. వీటి తయారీకి బ్లేడు, పిన్నీసులను మాత్రమే వినియోగిస్తున్నాడు.




మహేందర్ వేసిన కళారూపాలు

పాలరాయి, సిమెంటుతో శిల్పాలు

పాలరాయి, మట్టి, సిమెంటుతో అద్భుతమైన కళాకృతులను రూపొందిస్తున్నాడు మహేందర్. జైపూర్ మండలంలోని కుందారం, వేలాల ఆలయాతో పాటు ఎస్టీపీపీలో మహేందర్ తయారు చేసిన ఆకృతులు దర్శనమిస్తున్నాయి. కుందారంలోని హనుమాన్ ఆలయానికి శివలింగం, ఏనుగు, హనుమాన్ ఆకృతులను ఎంతో అందంగా తీర్చిదిద్దాడు. చెన్నూరులో మల్లికార్జున స్వామి ఆలయం గోపురాన్ని చక్కగా తయారు చేశారు. మహేందర్ తయారు చేసిన ఐదు శిరస్సుల నాగసర్పం ఆకృతి నాగులమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. సిమెంటుతో తయారు చేసిన నెమళ్లను ఎస్టీపీపీ మైదానంలో ఏర్పాటు చేశారు. శిక్షణ పొందిన నిపుణులు మాత్రమే చేయ గల విగ్రహాలను అలవోకగా చేస్తూ అందర్ని ఆశ్చర్యపరుస్తున్నాడు మహేందర్. అంతేకాకుండా పాలరాతితో తయారు చేస్తున్న వివిధ కళాకృతులు సైతం అందరినీ ఆకట్టు కుంటున్నాయి. పాలరాయి, గ్రానైట్ రాళ్లతో దేవుడి మంది రాలు, తులసీ గద్దెలు, శివ లింగం, వినాయకుడు, రుబ్బు రోలు, ఏనుగు తదితర విగ్రహాలను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం సూక్ష్మ కళలో ప్రతిభను చాటుతున్న మహేందర్ పెన్సిల్‌పై హనుమాన్, శివుడు, బుద్ధుడు, శివలింగం ఆకృతులను తయారు చేస్తున్నాడు.

చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది

చిలకాని మహేందర్, కుందారం



చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం, తయారు చేయడంపై ఆసక్తి. సుద్దముక్కలతో కళాకృతులు తయారు చేశాక సిమెంటు, పాలరాయితో కళారూపాలు చేసే నైపుణ్యం సాధించాను. ఆలయాలకు వెళ్లినప్పుడు రాతి శిల్పాలను చూస్తుంటా. ప్రాచీన కాలంలో శిల్పులు వాటిని ఎంతో అం దంగా చెక్కారు. రాతితో శిల్పాలు చెక్కడం లక్ష్యంగా పెట్టుకున్నాను. నా దగ్గర పనిచేస్తున్న ఐదుగురికి విగ్రహాల తయారీని నేర్పిస్తున్నాను. కుందారంలోని హనుమాన్ ఆలయంలో అన్ని విగ్రహాలను తయారు చేశాను.



పొదుపుతో భవిత భద్రం

- కిషోర బాలికలతో ప్రత్యేక ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు
- 15-18 ఏళ్ల బాలికలందరికీ సంఘాల్లో సభ్యత్వం
- యువతులకు సామాజిక అంశాలపై చైతన్యం
- వృద్ధులు, దివ్యాంగులతో నూతన సంఘాలు
- జిల్లాలో కొత్తగా మరో 30వేల మందిని చేర్చుకోవడమే లక్ష్యం

7

అమల్లోకి టోల్‌గేట్ రాయితీ చార్జీలు

- రూ. 3 వేలు చెల్లిస్తే వార్షిక పాసు
- 200 సార్లు ప్రయాణించే అవకాశం

6

నీల్వాయి ఎస్సై సస్పెన్షన్

- యువకుడిని చితకబాదిన ఘటనలో సీపీ చర్యలు



నింగి రంగేసుకుంది

బెల్లంపల్లి పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. సూర్యస్తమయం సమయంలో ఆకాశం బంగారు, పసుపు రంగులను అద్దుకున్నట్లు కనిపించిన దృశ్యం చూపరులను కట్టిపడేసింది.. దీంతో పలువురు ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్‌లో బంధించారు. - బెల్లంపల్లి, ఆంధ్రజ్యోతి



ఆహ్లాదం.. ప్రకృతి రమణీయం

అల్లంత దూరాన వంపులు తిరిగిన ఎత్తైన కొండలు.. వాటి చుట్టూ పచ్చని పొలాలు.. ఎత్తైన గుట్టలను తాకుతూ కమ్ముకున్న మేఘాలతో ప్రకృతి కాంత పరవశిస్తున్నట్టుగా కనిపిస్తున్న ఈ చిత్రం.. దండేపల్లి మండలంలోని కవ్వాల రిజర్వు ఫారెస్టు అటవీ ప్రాంతంలోనిది. పచ్చని తివాచీలా ఆహ్లాదపరిచే ఈ దృశ్యం ఆదివారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. - దండేపల్లి, ఆంధ్రజ్యోతి

ఎల్లంపల్లి గేట్ల మూసివేత

హాజీపూర్, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట వద్దగల శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను ఆదివారం అధికారులు మూసివేశారు. శనివారం ఎగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కడెం గేట్లు తెరువడంతో ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరడంతో 20 గేట్లు ఎత్తి నీటిని దిగువ గోదావరికి వదిలారు. ఆదివారం ఉదయం ఇన్‌ఫ్లో తగ్గడంతో పది గేట్లను మూసివేశారు. మధ్యాహ్నం వరకు మరో 10 గేట్లను మూసివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 28వేల క్యూసెక్కుల నీరు వస్తుంది. నంది పంపుహౌజ్ నుంచి 12,600 క్యూసెక్కుల నుంచి పంపుల ద్వారా ఎత్తిపోస్తూ మానేరుకు తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలకు ప్రస్తుతం 18.2582 టీఎంసీల నీరు ఉంది. పూర్తి నీటిమట్టం 148 మీటర్లకు 147 మీటర్ల నీటి మట్టం చేరింది.

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఘనంగా నిర్వహించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించాలని జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మడిపెల్లి వెంకటేశ్వర్‌లు తెలిపారు. ప్రతి గ్రామం,పట్టణంలో జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. మందమర్రిలో ఉదయం 10.30గంటలకు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

వరద నీటితో ఇబ్బందులు

మందమర్రిటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండో జోన్‌లోని ప్రజలు వరద నీటితో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో స్థానిక కార్మెల్ పాఠశాల వద్ద గల వరద నీరు రోడ్డుపైకి వచ్చి కాలనీలో చేరుతుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరి నిత్యవసరాలు తడిచిపోయాయని తెలిపారు. కోల్‌బెల్ట్ రోడ్డు పక్కన డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో నీరు ఇళ్లలోకి వస్తుందని దీంతో తమకు రోగాలు వస్తున్నాయని తెలిపారు. స్థానిక జీఎం, అధికారులు స్పందించి కాలనీలో నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సహకారం లేనట్టేనా..?



- సంఘాల ఎన్నికలు మరోసారి వాయిదా
- పీఏసీఎస్‌ల పదవీకాలం ఆరు నెలలు పొడగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సంఘాల విస్తరణపైనా సర్కారు దృష్టి
- కొత్త మండలాల్లో ఏర్పాటుకానున్న పీఏసీఎస్‌లు

మంచిర్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల పదవీకాలం ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చే సింది. అదే సమయంలో రైతులకు వెన్నుదన్నుగా ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) విస్తరణపైనా ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. రైతులకు పంట రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు అందిస్తూ అండగా నిలవడం సహకార సంఘాల విధి. గత బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినా...అవి బుట్టదాఖలు కావడంతో విస్తరణకు నోచుకోలేదు.

కొత్తవి ఏర్పాటు చేయకపోయినా...కనీసం ఉన్నవాటిని కూడా బలో పేతం చేయకపోవడంతో రైతులకు వాటి సేవలు అంతంత మాత్రంగానే అందు తున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక సంఘాల పరిధి ఎక్కువగా ఉండటంతో పాటు గ్రామాలకు దూరంగా ఉండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మండలాల్లో సహకార సంఘాలు లేకపోవడంతో ఆయా మండలాల రైతులు ఇతర మండలాల్లోని సొసైటీలకు వెళ్లాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాలో కొన్ని సొసైటీల పరిధిలో ఎక్కువ గ్రామాలు ఉండగా, మరికొన్ని సొసైటీలకు తక్కువ గ్రామాలున్నాయి. దీంతో దూరంగా ఉన్న సొసైటీ లకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

విస్తరణపైనా ప్రభుత్వం దృష్టి..

రాష్ట్రం ఏర్పాటైన తరువాత జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగిన అనంతరం ఆ మేరకు రైతులకు సహకార సేవలను మరింతగా పెంచేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సహకార సంఘాల విస్తరణ చేప ట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సహకార శాఖ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసింది. అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, గ్రామాల్లో సభలు నిర్వ హించి రైతుల అభిప్రాయాలను కూడా సేకరించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలకు అద నంగా ఎన్ని అవసరం అవుతాయో అంచనా వేసి ప్రతి పాదనలు తయారు చేశారు. సంబంధిత నివేదికలను ప్రభుత్వానికి పంపారు. దీంతో సహకార సంఘాల వి భజనకు రంగం సిద్ధం కాగా, డ్రాఫ్టు నోటిఫికేషన్ కూడా జారీ అయింది. సంఘాల విభజనే తరువాయి అనుకుంటున్న తరుణంలో ప్రభుత్వ నిర్ణయం మరుగున పడిం ది. 2020 ఫిబ్రవరి 15న ప్రభుత్వం సహకార ఎన్నికలను నిర్వహించింది. ఎన్నికల సమయంలోనే సంఘాలను విస్తరించాలని ప్రతిపాదించగా, కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విస్తరణ ప్రక్రియ ముందుకు సాగలేదు. అయితే రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకున్న..

మిగతా 7వ పేజీలో

అమాయకులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు

మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అమాయకులపై రాజకీయ కక్షతో కేసులు బనాయిస్తే భవిష్యత్‌లో తీవ్ర పరిణమాలు ఎదుర్కొంటారని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, పట్టణాధ్యక్షుడు గాదె సత్యంతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా అమాయకులపై పో లీసులు దాడి చేస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నార న్నారు. బీఆర్ఎస్ పక్షాన నిరసన, ధర్నా చేస్తే మాత్రం వెంటనే వచ్చి అరెస్టు చేస్తారని ఇదెక్కడి న్యాయం అన్నారు. అన్యాయం జరుగుతుందని ఫిర్యాదు చేయడానికి వెళితే కనీసం కేసు కూడా తీసుకోకపోవడం విస్మయానికి గురి చేస్తోందన్నారు. మండలంలోని రాపల్లి గ్రామంలో దళితుడైన ప్రవీణ్, నితీష్‌లపై సాయికుమార్‌అనే వ్యక్తి ఇతర కాంగ్రెస్‌పార్టీ నాయకులు దాడి చేశారని, తిరిగి అతనిపైనే ఫిర్యాదు చేయగా అమాయకుడైన ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారన్నారు. ఆయన తల్లిదండ్రులు గ్రామ పెద్దమనుషులకు చెబితే పెద్దమనుషులపై కూడా కేసు చేయడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బెదిరింపు రాజకీయాలతో అమాయకుల ఇండ్లపై పోలీసులు, రౌడీలు దాడి చేస్తూ అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు సుబ్బన్న, గోగుల రవీందర్‌రెడ్డి, వంగ తిరుపతి, నరేష్, అత్తి సరోజ, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

నష్టపోయిన పంటల పరిశీలన



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేమనపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో సాగు చేసిన పత్తి పంటలు నీట మునగడంతో నష్టపోయిన పంటలను, ఆదివారం వేమనపల్లి మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీ ర్ పరిశీలించారు. అలాగే కోతకు గురైన రోడ్లను, వర్షానికి కూలిన ఇళ్లను వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటలను సంబంధిత అధికారులతో సర్వే చేయించి నష్టపోయిన రైతులకు, బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట మాజీ ఎంపీపీలు లింగాగౌడ్, కుర్రు వెంకటేశం, నాయకులు సత్య నారాయణ, రాజన్న, రాంచందర్, గాలి మధు, మధుకర్‌గౌడ్ ఉన్నారు.

అండర్-17 క్రికెట్ పోటీల్లో విజేత ముంబై ఇండియన్స్ టీం

మంచిర్యాలక్రైం, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని శివాజీ గ్రౌండ్‌లో అండర్-17 క్రికెట్ పోటీల్లో విజేతలుగా ముంబై ఇండియ న్స్ నిలిచింది. గురు ఆకాడమి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వ హించిన పోటీల్లో రన్నర్స్‌గా సీఎస్‌కే నిలిచింది. ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా బొలిశెట్టి కిషన్, మెడికేర్ ఆసుపత్రి వైద్యులు మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురు క్రికెట్ అకాడమి దుర్గ ప్రసాద్ ఇలాంటి క్రీడలను నిర్వహించడం ఎంతో అభినందనీయ మన్నారు. మరిన్ని క్రీడలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించాల న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు ఎంపవిజయ్, వివేక్, అంబ్రోస్, బుస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న రఘునాథ్

లక్షెట్టిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరి హారం అందించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేసారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో గండి పడిన చెరువును ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే చెరువులకు గండి పడుతోందన్నారు. చెరువుకు గండి పడి వేల ఎకరాల్లో రైతుల పంటలు నష్టపోయారన్నారు. అంతే కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో కొమ్ము గూడెం గ్రామంలో వంతెన నిర్మించక పోవడం సిగ్గు చేటన్నారు.

ఈ గ్రామంలోనే కాకుండా అంకతుపల్లి పోతపల్లి గ్రామల మధ్య కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే టెంకాయ కొట్టి పనులు ప్రారంభించినా అవి ఇప్పటి వరకు ముందుకు సాగక పోవ టం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండు వంతెనలు నిర్మించాలని రైతులకు నష్ట పరిహారాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ జడ్పీటీసీ ముత్తె సత్తయ్య, నాయకులు బొప్పు కిషన్, లచ్చన్న, సతీష్, వెంకటేష్, రవీందర్, శశిధర్, పద్మ, సతీష్‌రావు, బింగి ప్రవీణ్, జయరాంరావు ఉన్నారు.

వేలాలకు పోటెత్తిన భక్తులు



గట్టు మల్లన్నను దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

జైపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల గ్రామంలోని గట్టుమల్లన్నను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం సందర్భంగా జిల్లాతో పాటు పెద్దపల్లి జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పట్నాలు, బోనాలు సమర్పించి మల్లన్న స్వామికి నైవేద్యాలను సమర్పించారు. భక్తుల రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా మంచిర్యాల, గోదావరిఖని డిపోల నుంచి బస్సులను నడిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం వద్ద ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● నిర్వాసితులను ఆదుకుంటాం ● ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

జన్నారం, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్వాసితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఖానీపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జన్నారం వాగు తదితర ప్రవాహ ప్రాంతాలైన బుడగ జంగాల కాలనీతో పాటు మండలంలోని రోటిగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్నవాగును సందర్శించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వరదలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో గోదావరి ప్రవాహం పెరుగుతుందని పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. అటవీప్రాంతం కావడంతో వాగు ఉప్పొంగి ప్రవ హిస్తుందని వాగులు దాటే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని వాగు పరివాహక ప్రజలు సైతం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అధికారులు ఎల్లప్పుడు అప్రమత్తం చేస్తున్నారని అధికార యంత్రాంగం అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి సమస్యలు తావులేకుండా చూస్తామన్నారు. వాగుపై వంతెన నిర్మాణా నికి చేపట్టామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ, మార్కెట్ కమిటీ ఎఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఉమర్‌షరీఫ్, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఇసాక్, అల్లంరవి, నందు నాయక్, మామిడిపెల్లి ఇంధయ్య, అయ్యర్ ఫసీఉల్లా పాల్గొన్నారు.



బుడగ జంగాల కాలనీని సందర్శిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఘనంగా తీజ్ ఉత్సవాలు



జన్నారంలో లంబాడీల నృత్యాలు

లక్షెట్టిపేట, ఆగస్టు,17 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని సత్యసాయినగర్, లంబడితాండాలో తీజ్ ఉత్సవాలను లంబాడీలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆయా కాలనీల్లో సంత్‌సేవాలాల్, జగ దాంబ అమ్మ వారికి ఉపవాసాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సురేష్ నాయక్, కాంగ్రెస్ నాయకుడు బోడ రాజు, లంబాడీ కుల పెద్దలు తారా చంద్, రవీందర్, తిరుపతి, రాంసింగ్, శ్రీనివాస్, రవి, రాహుల్, దినేష్ మహిళలు, యువతులు లంబాడీ కులస్తులు ఉన్నారు.

జన్నారం: బంజారాల ముఖ్య పండగ పీజు వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. వివాహం కాని యువతులు జరుపుకునే వేడు కల్లో ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వ హించి సాంప్రదాయ పద్ధతుల్లో మహిళలతో నృత్యాలు చేశారు. బంజారాల సాంప్రదాయాల ప్రకారం మహిళలు జరుపుకునే ఈ పండుగను సాంప్రదాయ పద్ధతి వేషధారణలతో నృత్యాలు చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు ఎర్ర చంద్రశేఖర్, సిదిమల్ల భరత్ కుమార్, జనార్ధన్‌లతో పాటు మండల బంజారాలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సత్యసాయి నగర్‌లో తీజ్ వేడుకల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న లంబాడీలు

భక్తి శ్రద్ధలతో మహంకాళి బోనాల జాతర

చెన్నూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోదావరి రోడ్డులో ఉన్న మహంకాళమ్మ ఆలయంలో ఆదివారం మహంకాళి బోనాల జాతరను చెన్నూరు పట్టణ వాసులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలోని చివరి ఆదివారం ఈ బోనాల పండగను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు. ప్రతాప మారుతి ఆలయం నుంచి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా కొనసాగింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండి అందరు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ దేవేం దర్‌రావు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వహ కులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న పట్టణ వాసులు